క్లుప్తంగా

తలనీలాల సమర్పణ



చిల్పూరు: చిల్పూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి గాదె రాజేందర్ నాయకురాలిపై అభిమానంతో తలనీలాలు సమర్పించాడు. నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా ఉన్న సింగపురం ఇందిర రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటూ గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ ఆలయంలో సోమవారం తలనీలాలు సమర్పించాడు.

కేసీఆర్‌పై అభిమానం చాటుకున్న రైతు



బచ్చన్నపేట: సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా చేసుకునేలా చేసినందుకు మండలంలోని గంగాపూర్‌లో ఓ రైతు అభిమానాన్ని చాటుకున్నారు. సోమవారం గ్రామానికి చెందిన రైతు పిట్టల శ్రీహరి తన వ్యవసాయ క్షేత్రంలో జై కేసీఆర్, జై బీఆర్ఎస్ గంగాపూర్ అనే ఆకారంలో నారు కట్టలను అమర్చి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు బాంధవుడు కేసీఆర్ అని, అన్నదాతల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా లాంటి సౌకర్యాలను కల్పిస్తూ గ్రామ గ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. సీఎం కేసీఆర్‌పై అభిమానాన్ని చాటిన శ్రీహరిపై పలువురు ప్రశంసల జల్లులు కురిపించారు.

నియామకం



సతీష్, ప్రధాన కార్యదర్శి

జనగామ: తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జనగామ పట్టణానికి చెందిన సురుగు సతీష్ గౌడ్‌ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కాసాని జ్ఞానేశ్వర్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు జయరాంచందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తన నియామకానికి కృషి చేసిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రామిని హరీష్, పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్‌గౌడ్, నరసింహ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నన్నూరు నర్సిరెడ్డి, కుందారపు కృష్ణ చారికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జగన్నాథ స్వామి రథయాత్ర



జనగామరూరల్: ఇస్కాన్ సొసైటీ కూకట్‌పల్లి వారి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో జగన్నాథస్వామి రథయాత్ర నిర్వహించారు. జనగామ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వరకు భక్తులు ఆట, పాటలు, కోలాట బృందాలతో రథయాత్ర చేపట్టారు. ధనుంజయపండిట్‌దాస్, సనాతన్‌దాస్, పండరీపురదాస్, భవాని, మహాదాస్‌ప్రభు పాల్గొన్నారు.

విమర్శలు మానుకోవాలి

బచ్చన్నపేట: దళితుల సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీపై పలువురు చేస్తున్న విమర్శలను మానుకోవాలని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు గందమల్ల నరేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ రామకృష్ణయ్యను హత్య చేసిన అంజయ్యను అరెస్టు చేసి జైలుకు పంపించారని, ఆయనను పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. కొందరు నాయకులు రామకృష్ణయ్య కుటుంబాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. సర్పంచ్ మధుప్రసాద్, నాయకులు బందారం వినయ్‌కుమార్, జంధ్యాల ఉపేందర్, బందారం కృష్ణ, తప్పట్ల వినోద్, మహిపాల్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాములు (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని పటేల్‌గూడానికి చెందిన బోయిని రాములు (65) ఈ నెల 14న కుందారం ఖాంసీగానికుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రాములు స్కూటీపై తన పొలం వద్దకు వెళ్తుండగా వెనుక నుంచి చీటూరుకు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని యశోద, నిమ్స్‌లో 13 రోజుల పాటు చికిత్స అందించినప్పటికీ కోలుకోకుండా మృత్యువాత పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాములు బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి బోయిని రాజు తండ్రి కావడంతో పలువురు బీఆర్ఎస్ నాయకులు మృతుడికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

బ్రిడ్జి నిర్మాణం కలేనా..?

- ఇబ్రహీంపూర్ చిన్న మత్తడి వద్ద కష్టాలు
- వర్షాకాలంలో ప్రజలు, విద్యార్థులకు తప్పని వెతలు
- ప్రతిపాదనలకే పరిమితమైన వైనం



వాగులో నుంచి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న స్థానికులు (ఫైల్)

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామ మధ్యలోని పెద్ద చెరువు చిన్న మత్తడి ముందు బ్రిడ్జి నిర్మాణం కలగానే మారింది. ఈ బ్రిడ్జి నిర్మాణం ప్రతిపాదనల దశ దాటక పోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది భారీ వర్షాల నేపథ్యంలో కొన్ని నెలల పాటు మత్తడి అలుగు పోయగా మరో దారి లేక వాగులోంచి రాకపోకలు సాగిస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లడం విద్యార్థులు, ఉపాధ్యాయులకు కష్టంగా మారింది. చిన్న మత్తడి అలుగు ఉధృతమైతే విద్యార్థులు పాఠశాలలకు బంద్ కావాల్సిందే. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో బ్రిడ్జి నిర్మిస్తామని చెబుతోన్న ప్రజాప్రతినిధులు అనంతరం ఆ విషయాన్ని విస్మరిస్తున్నారు. చిన్న మత్తడి ముందు బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు పలుమార్లు పాలకులను కలిసి విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేదని వాపోతున్నారు. వర్షాకాలం వస్తుందంటే గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వాగు ఉధృతికి రోడ్డు కొట్టుకు పోగా స్థానిక సర్పంచ్ తాత్కాలింగా ట్రాక్టర్ల ద్వారా మొరం పోశారు. మళ్లీ వాగు ఉధృత్తికి పలు మార్లు మొరం పోసి రాక పోకలు పునరుద్ధరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చిన్న మత్తడి అలుగు పోసిన ప్రతిసారి మరో దారి లేక వాగులో నుంచి భయం భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగులో నుంచి రాక పోకలు సాగే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

హామీ ఇచ్చి మరిచిన ఎమ్మెల్యే

గత ఏడాది గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చిన్న మత్తడి వద్దకు చేరుకొని బ్రిడ్జి కావాలా, సీసీ రోడ్డు కావాలా అని గ్రామస్తులను అడుగగా బ్రిడ్జి కావాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. బ్రిడ్జి మంజూరు చేస్తానని, వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని అక్కడి నుంచే ఫోన్‌లో సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. ఎమ్మెల్యే ఇచ్చిన మాట తప్పడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే రాజయ్య, ఉన్నతాధికారులు స్పందించి చిన్న మత్తడి ముందు బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇబ్రహీంపూర్ చిన్న మత్తడి వద్ద సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజయ్య (ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం..



వర్షాకాలంలో చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించే సమయంలో అవతలికి దాటలేక అవస్థలు పడుతున్నాం. మరో దారి లేక వాగులోంచే భయం భయంగా వెళ్లాల్సి వస్తుంది. ఎమ్మెల్యే రాజయ్య స్వయంగా వచ్చి బ్రిడ్జి నిర్మిస్తామని హామీఇచ్చారు. ఇప్పటికి పనులు ప్రారంభం కాలేదు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బ్రిడ్జి మంజూరి చేయాలి.

- గిరబోయిన సతీష్, వార్డు సభ్యుడు, ఇబ్రహీంపూర్

నిధులు మంజూరు చేయాలి



చిన్న మత్తడి ముందు బ్రిడ్జి లేకపోవడంతో అలుగు పోసిన ప్రతిసారి నీళ్లలోంచి రాకపోకలు సాగిస్తూ నానా తంటాలు పడుతున్నాం. దశాబ్దాలుగా ఇవే తిప్పలు, పాలకులు వస్తున్నారు, పోతున్నారు తప్ప బ్రిడ్జి మంజూరు చేసిన వారు లేరు. చిన్న మత్తడి అలుగు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు బంద్. దినదిన గండమన్నట్లు పరిస్థితి ఉంది.

- గ్యార నాగరాజు, స్థానికుడు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



జఫర్‌గఢ్: అవగాహన కల్పిస్తున్న ఎస్సై

జఫర్‌గఢ్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై బి. శంకర్‌నాయక్ కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికి స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించడం జరిగిందన్నారు. అ స్వేచ్ఛకు ఎవరు భంగం కలిగించినా చట్టరీత్య నేరమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత చెడుమార్గంలో పయనించి తమ జీవితాలను నాశనం చేసుకోకూడదన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, డాక్టర్ జానీనాయక్, మహేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



జనగామ: ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

జనగామ: యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో పయనించాలని శ్రీ అరబిందో హై స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం పురస్కరించుకొని శ్రీ అరబిందో స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ చౌరస్తా నుంచి నెహ్రూ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనార్థాలపై ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

మానవహారం

దేవరుప్పుల: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారిలో బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పట్టి తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసు రాజు, పోలీసు కానిస్టేబుల్ మసూద్, ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: బాలయేసు హైస్కూల్ విద్యార్థుల మానవహారం

బీసీ సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న కార్యదర్శులు

స్టేషన్‌ఘన్‌పూర్: బీసీ కులాల్లో చేతివృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష సబ్సిడీ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పరిశీలించారు. రూ.1లక్ష సబ్సిడీ లోన్ కోసం దరఖాస్తులకు ఈనెల 20 చివరి తేదీ కాగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల కార్యదర్శులు గ్రామాల వారీగా దరఖాస్తుల జాబితాను తీసుకుని దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను పరిశీలించారు. దరఖాస్తుదారుల నుంచి ఒక సెట్ జిరాక్స్‌లను సేకరించారు. రెండు రోజుల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి అర్హుల జాబితాను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

అధికారులపై చర్య తీసుకోవాలి



జనగామ: పట్టణంలో దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు నిర్మాణం చేస్తున్న గద్దెను కూల్చి వేసిన అధికారులపై చర్య తీసుకోవాలని కురుమ సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షుడు ఆలేటి రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని గుర్తించి ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తుంటే, కొంతమంది అధికారులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. వెంటనే గద్దె పునర్నిర్మాణంతో పాటు జూలై 4వ తేదీన కొమురయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలి

బచ్చన్నపేట: సబ్సిడీ యంత్రాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఒరిజినల్ సర్టిఫికెట్లను చూపించాలని ఈఓ అనిల్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని కేసిరెడ్డిపల్లి, బచ్చన్నపేట గ్రామాల్లో పలువురు లబ్ధిదారుల సర్టిఫికెట్లను ఆయన పరిశీలించారు. కార్యదర్శులు, కారోబార్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు సీజ్



పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేస్తున్న సత్యనారాయణ

జనగామ: స్థానిక సెయింట్ మేరీ స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండగా ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు మేరకు విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నోడల్ అధికారి సత్యనారాయణ పుస్తకాల గదిని సోమవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు పేద విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఐఐటీ, టెక్నో, ఫౌండేషన్ కాన్సెప్ట్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. పుస్తకాలు విక్రయించకూడదని డీఈఓ సర్క్యులర్ జారీ చేసిన వినకుండా అమ్మకాలు జోరుగా సాగిస్తున్నారని అన్నారు. ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేసినా ఎస్ఎఫ్ఐ ఊరుకోదని హెచ్చరించారు. సందీప్, లవకుమార్, వికాస్, మహేందర్, విఘ్నేష్, సందీప్, తరుణ్ పాల్గొన్నారు.

పెంబర్తిలో పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటు



పెంబర్తి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

జనగామ: బక్రీద్ పండగను పురస్కరించుకుని పోలీసుల ఆధ్వర్యంలో హైదరాబాద్–వరంగల్ ప్రధాన హైవే జనగామ మండలం పెంబర్తి సమీపంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ నెల 29న బక్రీద్ పండుగ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, పండగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా పోలీసులు నిఘా ఉంచారు.

పుస్తకపఠనంతో సామర్థ్యం పెంపు



పుస్తక పఠన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న భగవాన్

రఘునాథపల్లి: పుస్తకపఠనం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యం పెరుగుతుందని మండల విద్యాశాఖాధికారి భగవాన్ అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మితండా, ఫతేషాపూర్ పాఠశాలల్లో ఆయన పుస్తకపఠనం (రీడింగ్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రీడింగ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పుస్తక పఠనంతో విద్యార్థుల్లో సృజనాత్మకత, జ్ఞానం వికసిస్తుందన్నారు.

సంక్షిప్త సమాచారం

పశుమిత్రలను ప్రభుత్వం ఆదుకోవాలి

జనగామరూరల్: గత ఎనిమిదేళ్లుగా రాష్ట్రంలో మూగజీవాలకు సేవలు అందిస్తున్న పశుమిత్రలను ప్రభుత్వం ఆదుకోవాలని పశుమిత్ర వర్కర్స్ యూనియర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసు మాధవి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, పశుమిత్రల జిల్లా అధ్యక్షురాలు నాజియా, కార్యదర్శి మంగ, శ్రావణి, సంధ్య, స్వప్న, అనీత, రాణి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాలకుర్తి టౌన్: పెన్షన్ దారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు దొంగరి సోమయ్య, మండల కార్యదర్శి ఎస్. దీపక్ అన్నారు. ఈ మేరకు సోమవారం పాలకుర్తిలో తహసీల్దార్ భూక్య పాల్ సింగ్‌కు వినతి పత్రం అందజేచారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

జఫర్‌గఢ్: ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు సిహెచ్ సోమనర్సయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ముదిరాజ్‌లు కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య శ్రీనివాస్, సంఘం నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ శివారు గ్రామమైన జయాలలో ఇటీవల మృతి చెందిన గిద్దెల బాల్‌నర్సు కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ రూ. 10 వేల ఆర్థికసాయం సోమవారం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి: దళితులకు దళిత బంధు రెండో విడత నిధులు మంజూరు చేయడంతో మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు చిత్రపటాలకు బీఆర్ఎస్ నాయకులు, దళితులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. నవీన్, నాగిరెడ్డి, రాంబాబు, రాఘవరావు, యాకయ్య ఉన్నారు.

అభినందనీయం

దేవరుప్పుల: విధులు నిర్వర్తించే పాఠశాల విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయుల తోడ్పాటు అభినందనీయమని సర్పంచ్ ఈదునూరి రమాదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల (చెర్లబడి)లో హెచ్ఎం అంబటి అంజయ్య, ఉపాధ్యాయురాలు ఉమారాణి కలిసి రూ.5 వేల విలువగల నోటుబుక్స్‌ను వితరణ చేయగా ఆమె పంపిణీ చేశారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

బచ్చన్నపేట: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్ జీపీలో రికార్డులను ఆయన పరిశీలించి మాట్లాడారు.

మట్టి దందాపై చర్య తీసుకోండి

రఘునాథపల్లి: రఘునాథపల్లి దొడ్డిగుట్ట సమీపంలో ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా సాగుతున్న మట్టిదందాపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన గణేష్‌సింగ్‌ఠాకూర్ సోమవారం జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

తరిగొప్పుల: మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని బొంతగట్టు నాగారంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్వంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎంలు అనిత, కళ్యాణి, ఆశ వర్కర్లు జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, రాజయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



జనగామ రూరల్: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జనగామరూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. నాయకులు వికాస్, మహేందర్, విఘ్నేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ మండల నాయకులు కాసాని శ్రీకాంత్, సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఏబీవీపీ నాయకులు సోమవారం బంద్ చేయించారు. భూక్య విజయ్, అజయ్, సతీష్, దిలీప్, దినేష్ ఉన్నారు.

కొడకండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్‌తో ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. నాయకులు సాయిదుర్గ, మహేష్, జగన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు.

పాలకుర్తి: మండలంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్‌లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నాల రమేష్, నాయకులు భానుప్రకాశ్, కారుపోతుల నరేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

దేవరుప్పుల: విద్యావ్యవస్థను తెలంగాణ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏబీవీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కారుపోతుల నరేష్ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాల అపరిష్కృత సమస్యల సాధన కోసం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని పాఠశాలల తరగతులను బహిష్కరించారు.

కళాకారులను ఆదుకోవాలి

చిల్పూరు: అర్ధాకలితో ప్రాచీన కళలను కాపాడుతున్న కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని రీసెర్చ్ స్కాలర్ జీడి రమేష్ కోరారు. మండలంలోని పల్లగుట్టలో చిందు కళాకారుడు గజవెల్లి లింగయ్య బృందం కళాప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాభారత ఘట్టంలోని శశిరేఖ పరిణయ ఘట్టాన్ని ప్రదర్శించారు. ప్రదర్శన తిలకించిన రమేష్ మాట్లాడుతూ సమాజంలో కనుమరుగవుతున్న కళారూపాల్లో ఒకటైన చిందు కళను అర్ధాకలితో ప్రదర్శిస్తున్నారని అన్నారు. వీరి దుర్భర స్థితిని చూసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గోవధను అరికట్టాలి

దేవరుప్పుల: బక్రీద్ పండుగను పురస్కరించుకొని కొనసాగే గోవధను అరికట్టాలని అఖిల భారత్ హిందూ మహాసభ ప్రధాన కార్యదర్శి కమలేష్‌దాస్ మహారాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు విఘాతం కల్పించే గోవధను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేసి అదుపులోకి తీసుకున్న పశువుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు.

ప్రారంభోత్సవానికి భవనాల ముస్తాబు

కొడకండ్ల: మండలకేంద్రంలో నూతనంగా నిర్మాణమైన గ్రామ పంచాయతీ, గ్రంథాలయ భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబు చేస్తున్నారు. రెండు భవనాల నిర్మాణం పూర్తి కాగా తుది మెరుగులు దిద్దుతూ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేపట్టారు. గ్రామ పంచాయతీ పాత భవనం ఇరుకుగా ఉండటంతో నూతన భవనానికి మంత్రి దయాకర్‌రావు నిధులు మంజూరు చేయడంతో పాత భవనాన్ని కూల్చి వేసి అదే స్థలంలో నూతన భవన నిర్మాణం చేపట్టారు. రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్, రూ.20 లక్షల ఆర్‌జీఎస్‌ఎ నిధులతో పాటు రూ.20 లక్షల వరకు గ్రామ పంచాయతీ నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మించారు. అలాగే మండలకేంద్రంలో అనేక సంవత్సరాల క్రితం గ్రంథాలయం ఏర్పాటైనప్పటికీ సొంత భవనం లేక కొద్ది కాలం జీపీలో, పాత పోలీస్‌స్టేషన్‌లో అద్దె భవనంలో కొనసాగి ప్రస్తుతం ఊర్దూ పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న లైబ్రరీకి సొంత భవన నిర్మాణం కోసం కూడా మంత్రి దయాకర్‌రావు నిధులు మంజూరు చేయగా గ్రంథాలయానికి కేటాయించిన స్థలంలో నిర్మాణం చేపట్టారు. రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో పాటు దాదాపు రూ.10 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తయింది.

రేపు మంత్రి ఎర్రబెల్లిచే ప్రారంభోత్సవాలు..

ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 9.26 గంటలకు గ్రామ పంచాయతీ, గ్రంథాలయ నూతన భవనాలను రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించనున్నారు. సర్పంచ్ పసునూరి మధుసూధన్, కార్యదర్శి గంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.





ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న గ్రంథాలయం, జీపీ భవనం